06ATP27_06ATP27.qxd 31-10-2022 PM 10:10 Page 1



## కార్తీక మాసంలో ఆకర్షణగా ఆకాశదీపం


ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించిన మహిళలు

**బత్తలపల్లి, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** మండలంలో కార్తీకమాసం సందర్భంగా శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. సోమవారం కార్తీకమాసం మొదటివారంను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాలలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా అర్చకులు శివునికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మండలకేంద్రం లోని శ్రీ లలితా త్రిపుర సుందరి ఓంకారేశ్వరస్వామి దేవాలయంలో ఓంకారేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు ఆకాశదీపాన్ని ఎగురవేశారు. ఈ మాసం మొత్తం ఆకాశదీపాన్ని ఎగురవేస్తామని అర్చకులు తెలిపారు. ఈ వేడుకలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించారు. ఈ పూజలలో ఆలయ ధర్మకర్త, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పిటిసి కోటి సుధ తదితరులు పాల్గొన్నారు.

## ఘణంగా సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి ఉత్సవాలు

**బత్తలపల్లి, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** భారత తొలి ఉప ప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి వేడుకల సందర్భంగా రాష్ట్రీయ ఎక్తా దివస్‌ను మండలంలో ఘణంగా నిర్వహించారు. సోమవారం మడలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో తహశీల్దార్ యుగేశ్వరి దేవి, ఎంపిడిఒ సాయిమనోహర్‌లు పాల్గొని సర్దార్ వల్లబాయ్ పటేల్‌కు నివాళులరినపంచారు. అనంతరం వారు ఐక్యత, సమగ్రత గురించి వివరించారు. భారతదేశంకు స్వాతంత్రం అనంతరం సర్దార్ వల్లబాయ్ పటేల్ దేశంలో ఏర్పడ్డ అనిశ్చితి, అనైక్యతను తన చతురతతో పరిష్కరించారన్నారు. భారతీయులందరూ ఎల్లప్పుడూ ఐకమత్యంగా వుండడమే ఆయన లక్ష్యమన్నారు. అనంతరం విద్యార్థులతో 3 బాషలలో ప్రమాణం చేయించారు. అంతకు ముందు రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా ర్యాలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించిన ఎంపిడిఓ


ఆధార్ నమోదు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపిడిఓ

**బత్తలపల్లి, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** మండలంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్‌కార్డు నమోదు కార్యక్రమాన్ని ఎంపిడిఓ సాయిమనోహర్ పరిశీలించారు. సోమవారం మాల్యవంతం గ్రామంలో చివరి రోజు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సంద్బంగా ఆయన కేంద్రంలో ఆధార్ నమోదుకు ఎంత సమయం పట్టేది, ఎంతమంది నమోదు చేసుకున్నది ఆరాతీశారు.

## కార్మికుల సమస్యల పరిష్కరించడమే లక్ష్యం

### - సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు


జెండాను ఆవిష్కరిస్తున్న సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు

**ధర్మవరం క్రైం, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** పట్టణంలో కదిరి గేట్ దగ్గర ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవం జెండా ఎగురవేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సమావేశానికి చేనేత కార్మిక సంఘం కార్యదర్శి వెంకట నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏఐటియుసి చికాగో పోరాటం వల్ల కార్మికులకు ఎనిమిది గంటల పని దినాన్ని సాధించిదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నారన్నారు. కేంద్ర ప్రభు త్వం 44 చట్టాలను నాలుగు కోడ్స్‌గా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. 1920 అక్టోబర్ 31న స్థాపించడం జరిగిందన్నారు. ఏఐటియుసి స్థాపించి నేటికీ 103 సంవత్సరాలు గడిచిందన్నారు. కార్మికుల హక్కుల కోసం సుదీర్ఘ పోరాటాలు చేశారన్నారు. భవిష్యత్తులో సమరశీల పోరాటాలను నడిపించే ఏకైక సంఘం ఏఐటియుసి ఒక్కటేనన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి, సహాయ కార్యదర్శి రవి, రమణ, చేనేత పట్టణ అధ్యక్షులు వెంకటస్వామి, నాయకులు సురేష్, శ్రీధర్, మల్లీ, నారాయణస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పోతులయ్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## అభయ నిశ్వార్ధ సూపర్ 60 క్యాలెండర్లు విడుదల

**అగళి, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** మధూడి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తిమ్మప్ప, అభయ నిశ్వార్థ సూపర్-60 క్యాలెండర్లను విడుదల చేశారు. ఈ ఫౌండేషన్ వారు 10వ తరగతి విద్యార్థులకు ఏపి ఆర్‌జెసి, ఆర్డిటిసెట్, అగ్రిసెట్, పాలిసెట్ తదితర పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇస్తుందని, 30 రోజులపాటు ఈ విక్షణ ఉంటుందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఇందులో జీవన విధానం, విలువలు, నైపుణ్యంతోపాటు ప్రతి రోజు స్కూల్‌లో పరీక్ష, విశ్లేషణ, ఆద్యాత్మకత వివరణ తదితర వాటిపై శిక్షణ ఉంటుందని, ఈ శిక్షణ ఉన్నన్ని రోజులు విద్యార్థులకు ఉచిత భోజనం, స్టడీ మెటీరియల్‌ను అంజదేస్తారని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు దరఖాస్తు చేసుకునే వారు మధూడి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలి, పిఆర్ కోడ్ విధానం ఆన్‌లైన్ పరీక్ష, తదతర వివరాలను వారు అందజేస్తారని తెలిపారు.

## ఘనంగా వల్లభాయ్‌పటేల్ జయంతి


వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకల దృశ్యం

**అగళి, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఆదర్శ పాఠశాలలో ఘనంగా జరుపుకున్నట్లు ప్రిన్సిపాల్ చక్రధర్, అధ్యాపకులు తెలిపారు. రాష్ట్రీయ ఏక్తాదివస్ ప్రతిష్టను ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలను, సంస్థానాల విలీనం గురించి విద్యార్థులకు ప్రిన్సిపాల్ అవగాహన కల్పించారు.

## జిల్లా స్థాయి క్రీడలకు 15 మంది ఎంపిక


ఎంపికైన విద్యార్థులు వీరే

**అగళి, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** ఈ నెల 27, 28 తేదీల్లో మడకశిర జూనియర్ కళాశాలలో జరిగిన పోటీల్లో అగళి ఆదర్శ పాఠశాల విద్యార్థులు జిల్లా క్రీడా పోటీలకు 15 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చక్రధర్, పిడి నారాయణస్వామి తెలిపారు. అండర్-17 కబడ్డీ విభాగంలో మను, వంశీ, చందు, అండర్-14 విభాగంలో ప్రతినిధి, దర్శన్, కోకోలో దర్శన్, వాలీబాల్-17లో చిన్ను, మను, చందు, శటిల్ బ్యాడ్మింటన్‌లో వంశీ, చందు, దర్శన్, అథ్లెటిక్స్‌లో అండర్-17 విభాగం 100 మీటర్ల పరుగు పందెంలో వంశీ, 200లో ప్రతినిధి, 1500 మీటర్లలో మనోజ్, లాంగ్ జంప్‌లో ప్రతినిధి, షార్ట్‌పుట్‌లో మారుతిలు ఎంపికైనట్లు పిడి తెలిపారు. వీరు జిల్లా స్థాయి పోటీలకు కూడా ఎంపికవ్వడం పట్ల పాఠశాలలో విద్యార్థులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అభినందించారు.

## కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని.. కాపాడండి


ఫిర్యాదును చూపుతున్న వెంకటేషులు

**పెనుకొండ, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉంది తనను కాపాడండి అంటూ ఓ ప్రభుత్వఉద్యోగి భాయాందోళన చెందుతున్న సంఘటన పెనుకొండలో చోటు చేసుకుంది. బాధితుని కథనం మేరకు పెనుకొండ పట్టణానికి చెందిన పంచాయితీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో వెంకటేషులు ఉద్యోగం చేస్తున్నారు. ఇతనికి భార్య నాగమణి, కుమార్తె గౌతమి ఉన్నారు. సోమందేపల్లి మండలం కేతగాని చెరువుకు చెందిన భార్య తమ్ముడు రామచంద్రకుమార్తె గౌతమిని ఇచ్చి వివాహం చేశారు. ఈ క్రమంలో భార్య నాగమణి, బావమరిది రామచంద్రలు తనను చంపి ఉద్యోగాన్ని కూతురికి ఇప్పించాలనే దురుద్దేశ్యంతో తనపై దాడులకు పాల్పడుతున్నారని వెంకటేషులు ఆరోపించారు. మూడేళ్లుగా తనను ఏదో విధంగా హతమార్చాలని కుట్రలు చేస్తున్నారని తెలిపారు. గతంలో కేతగాని చెరువులో తనపై దాడి చేశారని, ఈ విషయంపై పోలీసులను ఆశ్రయించానన్నారు. పోలీసులు కుటుంబ కలహాలని సర్దిచెప్పి పంపించారన్నారు. తనను ప్రతిరోజు భార్య, భావమరిదిలిద్దరూ వేదిస్తున్నారని వారు ఎప్పుడైనా తనను చంపుతారని భయాందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై లాయర్ ద్వారా ప్రైవేట్ కేసు వేస్తున్నానని, అదే విధంగా జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేస్తానని వెంకటేశులు తెలిపారు.

## నలగానహళ్లి గ్రామ పంచాయితీ మెంబర్‌గా దుర్గమ్మ విజయం


పంచాయితీ మెంబర్ దుర్గమ్మను సన్మానిస్తున్న నేతలు

**పావగడ, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** పావగడ తాలూకా నలగానహళ్లి గ్రామ పంచాయితీ మెంబర్‌గా దుర్గమ్మ విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి రాజగోపాల్‌తెలిపారు. ఆ స్థానం ఎస్టీ రిజర్వేషన్ కావడంతో ఇంతకు మునుపు ఎన్నికైన భార్గవి ఆ స్థానానికి రాజీనామా చేయడంతో ఖాళీ అయిన ఆ స్థానానికి 28వ తేదిన పోలింగ్ నిర్వహించారు. సోమవారం ఉదయం ఓట్ల లెక్కింపు జరుపగా 728 ఓట్లు పోలయ్యాయి. దుర్గమ్మకి 512 ఓట్లు రాగా తమ ప్రత్యర్థికి 196 ఓట్లు వచ్చాయి. 326 ఓట్ల ఆధిక్యంతో బిజెపి నాయకులు కోటేశ్వరరెడ్డి, కోటగుడ్డం నారాయణప్ప, టైలర్ నారాయణ, గోపాలప్ప, మగ్గాల నారాయణ, రఘురాం, కొత్తలం మంజు, కొత్తలం హనుమంతప్ప, ఎన్‌సి రామప్ప, మెంబర్ దుర్గప్ప, రామచంద్రప్ప తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీభోగిరామేశ్వరామేశ్వరుడు

**మడకశిర అక్టోబర్ 31 ప్రభాతవార్త;** కార్తీకమాసం మొదటి సోమవారం పట్టణంలోని పలు ఈశ్వరుని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని కోటవీధిలో వెలసిన శ్రీభోగిరామేశ్వరాలయంలో, శివాపురం లోని శ్రీచంద్రమౌళేశ్వరాలయంలో, కొండపై వెలసిన శ్రీరామలింగేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రీ చంద్రమౌళ్వేర స్వామి దేవాలయంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాల ప్రాకారోత్పవాన్ని నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు దేవాలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు.

## గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం విజయవంతం చేయండి

### -రొద్దం ఎంపిపి చంద్రశేఖర్, వైసీపీ మండల కన్వీనర్ తిమ్మయ్యలు పిలుపు

**రొద్దం, అక్టోబర్ 31 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గడపగడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రొద్దం మండల పరిధిలోని చిన్నమంతురు, దందేపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహిస్తున్న గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకర్‌నారాయణ విచ్చేస్తున్నాని.. మండలం వ్యాప్తంగా ఉన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని రొద్దం ఎంపిపి చంద్రశేఖర్, వైసీపీ మండల కన్వీనర్ తిమ్మయ్యలు సోమవారం ఓ ప్రకటనలో పిలుపు నిచ్చారు.

## బాధిత కుటుంబాలకు చేయూత నివ్వండి

### - తహశీల్దార్‌కు వినతి


తశీల్ధార్‌కు వినతి అందిస్తున్న దృశ్యం

**అమరాపురం, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని అమరాపురం ఎస్సీ కాలనీ యందు భారీ వర్షం కారణంగా చెరువులోకి నీరు చేరి దాదాపు 50, 60 ఇళ్ల కుటుంబాలు నిరాశ్రయులు అయినటు తక్షణం వారికి చేయూత నందించి ఆదుకోవాలని బాధిత కుటుంబాల తరుపున రాష్ట్ర వైసీపీ సంయుక్త కార్యదర్శి అమరాపురం సర్పంచ్ వాగేష్ తహశీల్దార్ సురేష్ కుమార్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు తమకు ప్రస్తుతం నివాసముండటానికి ఇళ్లు లేవని ప్రత్యమ్నాయంగా అద్దె తీసుకునే భవనాలు కూడా లేని కారణంగా ఒక వేళ అద్దె భవనాలు ఉన్నా వాటికి బాడుగులు చెల్లించలేని దుస్థితిలో ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు ప్రత్యామ్నాంగా తమకు ఇంటి స్థలంలోపాటు ఇళ్లు మంజూరు చేసి న్యాయం చేయాలని బాధిత కుటుంబాలకు తహశీల్దార్ సురేస్‌కుమార్‌కు వినతి అందజేశారు. సర్పంచ్ వాగేష్ మాట్లాడుతూ ప్రభుత్వం బాధిత కుటుంబాలకు చేయూత నిచ్చి ఆదుకోవాలని తెలిపారు. అదే విధంగా వర్షం కారణంగా కొన్ని పాత ఇల్లు కూడా కూలిపోయినట్లు ఆయన పేర్కొన్నారు.

## ప్రజలకు సేవ చేసినప్పుడే ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు


సన్మానం చేస్తున్న దృశ్యం

**అమరాపురం, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** ప్రజలకు సేవ చేసిన ఉద్యోగులకు ఎప్పుడు సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని విద్యుత్ శాఖ ఏడి దేవకుమార్, రొద్దం ఏఈ శ్రీనివాసమూర్తిలు పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో లైన్‌మెన్‌గా అమరాపురం సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన అంప్పేగౌడ్ భార్య గంగమ్మలకు విద్యుత్‌శాఖ సిబ్బంది, అధికారులచేత ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా లైన్ ఇన్స్పెక్టర్లు లక్ష్మణదాస్, ఫ్యారాజాన్, లైన్‌మెన్ నాగరాజు, శివశంకర్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏడి మాట్టాడుతూ ఉదో్యగులు అంకిత భావంతో సేవ చేసినప్పుడు ప్రజల నుంచి గుర్తింపు వస్తుందన్నారు. అంపే గౌడ్ కూడా ఉదో్యగంలో ఉన్నప్పుడు ప్రజలకు విద్యుత్ పరంగా సేవలు చేశారని ఈ సందర్భంగా అధికారులు, విద్యుత్ సిబ్బంది కొనియాడారు. అనంతరం అంపే గౌడ్ దంపతులను ఘనంగా సన్మానం చేశారు.

## ఘనంగా ఇందిరాగాంధీ 38వ వర్ధంతి

**ఉరవకొండ, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** పట్టణంలో సోమవారం భారత తొలి మహిళా ప్రధాని ఉక్కుమహిళ ఇందిరాగాంధీ 38వ వర్ధంతిని కాంగ్రెస్, సామాజిక కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కవిత సర్కిల్‌లో ఇందిరాగాంధీ చిత్రటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ దేశానికిచేసిన సేవలనునాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, ఓబులేష్, గోపాల్‌రెడ్డి, సోనియా శీనా,అబ్బాస్, సామాజిక కార్యకర్తలు కేతిరెడ్డి రాంమోహన్‌రెడ్డి, పాల్తూరు ఆనందరాజు, చంద్రారెడ్డి, శ్రీరాములు, అంజినయ్య పాల్గొన్నారు.

## ఆర్టీసి బస్టాండ్‌ను పునర్‌నిర్మించాలి


అధికారులకు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**గుత్తి, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** ప్రయాణీకుల పాలిట యమగండంలా మారిన ఆర్టీసి బస్టాండ్‌ను మరమ్మతులు కాకుండా పునర్‌నిర్మించాలని జనసేన మండల, పట్టణ అధ్యక్షులు చిన్నా వెంకటేష్, పాటిల్ సురేష్‌లు డిమాండ్ చేశారు. సోమవారం వారు బస్టాండ్‌ను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్న బస్టాండ్‌లో ప్రయాణీకుల సౌకర్యాలను అధికారులు విస్మరించడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా స్పందించి పూర్తి స్థాయిలో బస్టాండ్‌ను పునర్‌నిర్మించి తగు సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌టిఐ రమణమ్మకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో బోయగడ్డ బ్రహ్మయ్య, చాంద్‌బాష, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో ఏకలవ్య సంఘం నేతలు


నోటీసులు అందచేస్తున్న దృశ్యం

**గుత్తి, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** ఇతర కులాలను ఎస్‌టిలో చేర్చరాదని ఏకలవ్య, ఎరుకుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు వెళుతున్న ఏకలవ్య సంఘం నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఎస్‌టి సెల్ టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోవిందుతో పాటు పలువురికి 41 సెక్షన్ మేరకు నోటీసులు జారీ చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిబంధనల దృష్ట్యా ధర్నాకు అనుమతి లేదని వెళ్లరాదని హుకుం జారీ చేశారు. అనంతరం సొంత పూచికత్తుపై వారిని విడుదల చేశారు. ప్రజా స్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కు లేకుండా ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని వారు విమర్శించారు.

## ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని వినతి


తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**గుత్తి, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** గుత్తి మున్సిపల్ పరిధిలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఐఎంఎల్ న్యూ డెమొక్రసీ కార్యదర్శి శ్రీరాములు, సురేష్‌లు డిమాండ్ చేశారు. పట్టణ శివారు ప్రాంతంలోని సర్వేనెంబర్ 461బి3లో 2.09 ఎకరాల విస్తీర్ణం గల ప్రభుత్వ భూమిని ఒక మత సంస్థ కబ్జా చేయడానికి యత్నిస్తోందని వారు విమర్శించారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించి సదరు భూమిని ప్రజలకు ఉపయోగార్థం వినియోగించుకోవాలని కోరుతూ తహశీల్దార్ మహబూబ్‌బాషకు వారు వినతిపత్రం అందచేశారు. ఈ కార్య క్రమంలో ఐఎఫ్‌టియు పట్టణాధ్యక్షులు రఘు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ రవాణా అరికట్టేందుకు సహకరించాలి

**గుత్తి, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** నేటి సమాజంలో స్వార్ధ పూరిత ప్రయోజనాల కోసం బాలికలు, మహిళల అక్రమ రవాణా అరికట్టేందుకు ఆటో డ్రైవర్లు సహకరించాలని ఆర్‌పిఎఫ్ సిఐ అనురాగ్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో 1098, ఆర్‌పిఎఫ్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక విలవిలలాడుతున్న యువతను ప్రలోభపెట్టి అక్రమంగా వారిని తరలించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో అనుమానాస్పద కదలికల పట్ల డ్రైవర్లు అప్రమత ంగా వ్యవహరించి తగు సమాచారం అందించి వారిని రక్షించేందుకు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ లింగమయ్య, కో ఆర్డినేటర్ బాలాజీ, నాగలక్ష్మి, కృష్ణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం

### -సర్ధార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి ఘన నివాళులు



సర్దార్ వల్లబాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ సమైక్యతా దినోత్సవం ఘనంగా జరిగింది. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉక్కు మనిషి, భారత తొలి ఉప ప్రధానమంత్రి సర్ధార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ సిబ్బంది పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశ సమైక్యతకు పటేల్ ఎంతో కృషిచేశారని సేవలనువివరించారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎన్.కె.అరుణజ్యోతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా॥బి.వెంకటరాముడు, ఎన్.ఎ.అల్తాఫ్, ఇతర అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..**పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సమైఖ్యతా దినోత్సవం సందర్భంగా పటేల్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఎన్.మమత, ఇతర అధ్యాపకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ ఖాధర్‌ఖాన్, పద్మావతి, శివప్రసాద్, వాసవి తదితరులు పాల్గొన్నారు.

## హంద్రీనీవాకు తక్షణం నీటిని విడుదల చేయండి

### -తహశీల్దార్ కార్యాలయం ముందు టీడీపీ ఆందోళన


ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు

**ఉరవకొండ, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** హంద్రీనీవా కాలువకు తక్షణం నీటిని విడుదల చేయాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేసింది. సోమవారం ఆ పార్టీ నాయకులు పట్టణంలోని స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు ఎన్.విజయభాస్కర్, కార్యదర్శి మోపిడి గోవిందు, పట్టణ అధ్యక్షుడు మాదినేని రామాంజినేయులు, మాజీ వైస్ ఎంపీపీ పి.రాజేష్, నాయకులు సీతారాములు, యేళ్ల తిమ్మప్ప, పెద్దముష్టూరు బోసు, చాలాల ఎర్రిస్వామి. గోపాల్ తదితరులు మాట్లాడుతూ హంద్రీనీవా కాలువకు 15రోజుల క్రితం ఎటువంటి ముందస్తు హెచ్చరిక లేకుండా నీటిని నిలిపివేశారని దీంతో ఉరవకొండ ప్రాంతంలో దాదాపు 30వేల ఎకరాల్లో సాగులోవున్న మిరప, మొక్కజొన్న, వేరుశెనగ, ప్రత్తి, వరి పంటలకు వాడుముఖం పడుతున్నాయన్నారు. దీంతో రైతులు ఆందోళనకు గురవుతుంటే నీటి విడుదల గూర్చి ప్రభుత్వం, హంద్రీనీవా అధికారులు ఎలాంటి ప్రకటనలు చేయడంలేదన్నారు. ఆందోళన అనంతరం స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.బ్రహ్మయ్యకు వినతిపత్రం అందించారు.

## అనాధ పిల్లల ఆశ్రమాన్ని తనిఖీ చేసిన అధికారులు

### -నిర్వాహకులకు సూచనలిచ్చిన అధికారులు


అనాధ పిల్లల ఆశ్రమాన్ని తనిఖీ చేస్తున్న అధికారుల బృందం దృశ్యం

**ఉరవకొండ, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** పట్టణంలోని మొట్టమొదటి చిన్నపిల్లల ఆశ్రమాన్ని సోమవారం ఉదయం డీపీఓ ఫరూక్‌బాషా, సీడబ్ల్యూసీ కామేశ్వరి, మెడికల్ ఆఫీసర్ ఉన్నతి, పోనిక్ చంద్రకళ, ఎల్‌సీపీఓ సంధ్య, సూపర్‌వైజర్ వై.రాజమ్మ, ఎస్‌డబ్ల్యూ నాగలక్ష్మి బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా వారు పిల్లలతో ముచ్చటించి వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈక్రమంలోనే ఆశ్రమ నిర్వాహకుడైన ఫాస్టర్ సురేష్‌తో సమావేశమైన బృందం పిల్లలకు నాణ్యమైన భోజనం అందించి వారి ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని చదువు చెప్పించాలని సూచించారు.

## హంద్రీనీవాకు నీటికోసం జాతీయ రహదారి దిగ్బంధనం

### -హంద్రీనీవా వంతెనకు ఇరువైపులా జాతీయ రహదారిలో స్తంభించిన ట్రాఫిక్ -వారంలోపు నీరివ్వకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామన్న సీపీఎం, కాంగ్రెస్


42వ నంబర్ జాతీయ రహదారిలో హంద్రీనీవా వంతెనపై కూర్చొని సీపీఎం కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న రైతులు


నాయకులను బలవంతంగా పక్కకు లాగేస్తున్న పోలీసుల దృశ్యం

**ఉరవకొండ, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** హంద్రీనీవా కాలువకు సాగునీటి విడుదల కోసం ఉరవకొండ ప్రాంతానికి చెందిన రైతులు సోమవారం రోడ్డెక్కారు. సీపీఎం, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో మండల పరిధిలోని చి న్నముష్టూరు గ్రామ సమీపంలో అనంతపరం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలో హంద్రీనీవా కాలువపై నిర్మించిన వంతెనపై బైటాయించిన ఆందోళనకారులు నీరిచ్చి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఎన్.మధుసూదన్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.రంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సోనియా శీనా, మండల కార్యదర్శి ఇంద్రావతి ఓబులేసు తదితరులు మాట్లాడుతూ ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండా కాలువకు ఉన్నఫలంగా నీటిని నిలిపివేసి దాదాపు పక్షం రోజులు గడుస్తుంటంతో పంటలు వాడుముఖం పడుతుండటంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని రైతుల గోడు పట్టించుకునే నాథులే కరువయ్యారన్నారు. హంద్రీనీవా కాలువ పొడవునా దాదాపు ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల పరిధిలో దాదాపు 50వేల ఎకరాల్లో మిరప, వరి, వేరుశెనగ, ప్రత్తి, మొక్కజొన్న తదితర పంటలు సాగులో ఉన్నాయని మరో వారం రోజుల్లో పంటలకు నీరందించకపోతే వందల కోట్ల పెట్టుబడులు, వేలకోట్ల దిగుబడులను రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. రైతులు ఆందోళనలు చేస్తుంటే ఇటు అధికారులు అటు అధికార వైసీపీ నాయకులు నీరొస్తాయని అంటున్నారుగాని ఎప్పుడొస్తాయో చెప్పడంలేదని మండిపడ్డారు. నీటిని విడుదల చేసేంతవరకు వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉరవకొండ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ వి.హరినాథ్, ఎస్ఐ టి.పి.వెంకటస్వామి సిబ్బందితోపాటు ఆందోళన ప్రదేశానికి చేరుకొని వారిని బలవంతంగా పక్కకు లాగేసి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుర్రం సుధాకర్, సీపీఎం నాయకులు సిద్దప్ప, శీనప్ప, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కార్తీక తొలి సోమవారం పూజలు

### -వివిధ ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు


ప్రత్యేకాలంకరణలో శ్రీ గవి సిద్ధేశ్వరస్వామి

**ఉరవకొండ, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా వివిధ ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు కొనసాగాయి. స్థానిక శ్రీ గవిమఠ సంస్థానంలో వెలసిన గవి సిద్దేశ్వరస్వామి వారికి అర్చకులు విరుపాక్షిస్వామి ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక అభిషేకాలు, బిల్వార్చన, పూజలు కొనసాగాయి. అదేవిధంగా స్థానిక శ్రీ భక్త మార్కెండేయస్వామి, శ్రీ మల్లేశ్వరస్వామి, శ్రీ నీలకంఠేశ్వరస్వామి, మండల పరిధిలోని పెన్నహోబిళ క్షేత్రంలోగల శివాలయం తదితర ఆలయాల్లోనూ విశేష పూజలు కొనసాగాయి. గవిమఠంలోని శ్రీ గవిసిద్దేశ్వరస్వామి ఆలయ అర్చకులు విరుపాక్షిస్వామి మాట్లాడుతూ హరిహరాదులకు ప్రీతిపాత్రమైన ఈ మాసంలో భక్తకోటి యావత్తూ కఠిన నిష్టతో చేపట్టే నోములకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ మాసంలో పాఢ్యమి, చవితి, పౌర్ణమి, చతుర్ధశి, ఏకాదశి, ద్వాదశి తిథుల్లో శివపార్వతుల అనుగ్రహం కోసం మహిళలు పూజలు చేస్తుంటారన్నారు.

## హంద్రీనీవా కాలువకు వెంటనే నీటిని విడుదల చేయండి

### - సజ్జల, ఈఎన్‌సీను కోరిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



**ఉరవకొండ, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** హంద్రీనీవా కాలువకు నీటిని వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఈఎన్‌సీ నారాయణరెడ్డిను ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి విన్నవించారు. సోమవారం విజయవాడలో వారిని కలిసి ఈమేరకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ అధికవర్షాల కారణంగా హంద్రీనీవా కాలువ గట్లు బలహీనంగా ఉన్నచోట దెబ్బతింటాయన్న ఉద్దేశంతో గత 10 రోజుల క్రితం శ్రీశైలం జలాశయం నుండి కాలువకు నీటిని నిలిపివేశారని దీంతో కాలువ కింద పంటలు సాగు చేసుకున్న రైతులు కాలువలో నీరు ఉన్నట్టుండి నిలిచిపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లో కాలువెంబడి వేల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేశారు కావున రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే కాలువకు నీటిని విడుదల చేయాలని కోరినట్లు వై.విశ్వేశ్వరరెడ్డి వివరించారు.

## ఇందిరాగాంధీ, సర్దార్‌వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళులు


చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న గ్రంథాలయ అధికారి గోవింద్

**కనగానపల్లి, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని స్థానిక గ్రంథాలయంలో సోమవారం మండల గ్రంథాలయ అధికారి గోవిందు ఆధ్వర్యంలో మాజీ ప్రదాన మంత్రి ఇందిరాగాంధీ వర్ధంతి స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ. ఉక్కు మహిళగా మాజీ ప్రధానమంత్రిగా మూడు దశాబ్దాలుగా పరిపాలన చేసిన గొప్ప మహిళ ఇందిరాగాంధీ అని ఆమె ఆ పదవికి వన్నె తెచ్చారని ఆమె సేవలను కొనియాడారు. అలాగే సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వ్యక్తి అని అలాగే దేశ సమైక్యతకు పాటు పడిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోండి

### -సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహాదేవ్

**కనగానపల్లి, అక్టోబర్ 31 ప్రభాతవార్త :** పంట చేతికొచ్చే సమయంలో ఇటీవల అకాల వర్షాలతో పంట పూర్తిగా వర్షానికి దెబ్బతిందని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని సోమవారం స్పందన కార్యక్రమంలోసిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెల్లం మహాదేవ్ తహశీల్దారు పివి రమణకు వినతిపత్రం అందించారు. బెల్లంమహాదేవ్ మాట్లాడుతూ..ఇటీవల అకాలవర్షాలతో వేరుశనగ,టమాట,పత్తి, చీనీ, ద్రాక్ష, బొప్పాయి, పండ్ల తోటలు పూర్తిగా దెబ్బతిని పెట్టిన పెట్టుబడులు కూడా దక్కలేదన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు 25వేలరూపాయలచొప్పున నష్టపరిహారం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఈకార్యక్రమంలోరైతుసంఘంనాయకులురైతులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు ఆస్తులకు రక్షణ కల్పించాలి

**- లీజుకు ఇచ్చి ధారాదత్తం చేస్తే మూకుమ్మడిగా రాజీనామా చేస్తాం**
**- కౌన్సిల్ సమావేశంలో ధ్వజమెత్తిన కౌన్సిలర్లు**



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్, హాజరైన కౌన్సిలర్లు

**కదిరి, అక్టోబర్ 31, ప్రభాతవార్త**

వక్ఫ్ బోర్డుకు సంబంధించిన భూములు, ఆస్తులు ఎవరికైనా ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చి ధారాదత్తం చేయడానికి ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోమని కౌనిలర్లుందరూ మూకుమ్మడిగా రాజీనామా చేసా ్తమని కౌన్సిలర్లు ఎంఎన్ ఫయాజ్, కూరగాయల ఇస్మాయిల్‌లు ధ్వజమెత్తారు. కదిరి మున్సిపల్ సమావేశం చైర్‌పర్సన్ పరికి నజిమున్నిసాసాదిక్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు చెందిన వక్ఫ్‌బోర్డు ఆస్తులకు మున్సిపాలిటీ పాలకవర్గంతో పాటు అధికారులు తగిన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కౌన్సిలర్లు మరో ఆంశంపై మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని వీదులు, ప్రధాన రోడ్లను రోజూ శుభ్రపరిచేవారని ప్రస్తుతం వారానికి ఒకసారికూడా శుభ్రం చేయడంలేదని కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. గత టిడిపి హయాంలో వక్ఫ్‌బోర్డు ఆస్తులు ఇతర అభివృద్ధి పనుల్లో విపరీతమైన అవినీతి జరిగిందని కౌన్సిలర్ ఖాసీం సభలో ప్రస్తావించగా ఇందుకు 1వ వార్డు కౌన్సిలర్ గంగాదేవి ఆగ్రహం వ్యక్తం చేస్తూ తీవ్రంగా ఖండించింది. ఇందుకు ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు అధికారపార్టీ కౌన్సిలర్లు నడుమ పరస్పరం వాగ్వివాధం చోటు చేసుకుంది. దీంతో వైస్ చైర్మెన్ గత ప్రభుత్వం హయాంలో జరిగిన అంశాలపై ఇప్పుడు ప్రస్తావన తీసుకురావడం అనవసరం అని సభాముఖంగా తెలియచేశారు. అన్ని వార్డుల్లో నిత్యం త్రాగునీరు సరఫరా చేయాలని కౌన్సిలర్లు అందరూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శ్రీహరిబాబు, వైస్ చైర్మెన్‌లు కొమ్ముగంగాదేవి, రాజశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో శ్రీ విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ మస్తాన్

**ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 31, ప్రభాతవార్త**

వారియర్స్ షోటోఖాన్ కరాటే పోటీల్లో మండల కేంద్రంలోని శ్రీ విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు విశేష ప్రభిత కనబరిచారు. అక్టోబర్ 29, 30 వ తేదీల్లో కదిరిలో నిర్వహించిన కరాటే చాంఫియన్‌షిప్ పోటీల్లో తమ పాఠశాల నుంచి 23 మంది పాల్గొన్నారని అందులో 8 మంది బంగారు పథకాలు, 9 మంది రజిత పథకాలు, 3 కాంస్య పథకాలు సాదించినట్లు ప్రిన్సిపాల్ మహమ్మద్‌రఫి, వ్యాయామ ఉపాధ్యాయుడు సాదిక్‌వలి తెలియచేశారు. పథకాలు సాదించిన విద్యార్థులను సోమవారం కరస్పాడెంట్ కె మస్తాన్, కరాటే మాష్టర్ షెక్షావలిలు అభినందిచారు.

## విధులకు అనుసంధానంగా సమయం కేటాయించాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విఆర్‌ఓలు

**ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 31, ప్రభాతవార్త**

ప్రభుత్వ ఆదేశాల మేరకు తాము నిర్వర్తించాల్సిన విధులకు అనుసందానంగా అధికారులు తగు సమయం కేటాయించాలని మండల విఆర్‌ఓలు పేర్కొన్నారు. ఈ సందర్భంలో స్థానిక తహశీల్దార్ కారా ్యలయంలో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన కార్య క్రమంలో విఆర్‌ఓలు తమ సమస్యలపై మూకుమ్మడిగా తహశీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం విఆర్‌ఓ సుధాకర్ మాట్లాడుతూ తమకు కేటాయించిన విధుల్లో ప్రజలకు ముఖ్యమైన విధులకు సంబంధించి క్రమ పద్ధతి పాటించి నిర్ణీత సమయం కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ ప్రభుత్వ పథకాలను విరివిగా అమలు చేస్తున్న తరుణంలో అదనపు పనిభారం విఆర్‌ఓలపై పడిందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరవేయడానికి తమ సమయం సరిపోతోందన్నారు. మరో వైపు రెవెన్యూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూసర్వే, ఇతర రెవెన్యూ పరమైన, వ్యవసాయశాఖకు సంబంధించిన విధులు, హౌసింగ్ ఇతర శాఖలకు సంబంధించిన పనులను నిర్వహించలేక తీవ్ర మానసిక ఒత్తిడికి గురౌవుతున్నారని విఆర్‌లు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేశారు. సెలవు రోజుల్లో కనీసం కుటుంబ సభ్యులతో సైతం కాస్తసమయం కేటాయించి వారితో గడపడానికి కూడా తీరికలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దీంతో పాటుగా తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తి పలు వ్యాదుల బారిన పడి అనునిత్యం వైద్యశాలల చుట్టూ తిరిగే పరిస్థితి దాపురించిందని వాపోయారు. ఈ కార్యక్రమంలో విర్‌ఓలు గంగాధర్, రమణప్ప, అంజినేయులు, లోకేశ్వరమ్మ, శ్రీలత, రాజు, శివప్ప, రమణలు పాల్గొన్నారు.

## ఘనంగా పటేల్ జయంతి వేడుకలు

**తలుపుల, నవంబర్1, ప్రభాతవార్త**



పటేల్ చిత్రపరం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని బస్టాండు మూడురోడ్ల కూడళి వద్ద సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎద్దుల రాముడు ఆద్వర్యంలో అభిమానులు ముందుగా ఆయన చిత్రపఠానికి పూలమాలలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 1875వ సంవత్సరం అక్టోబర్ 31న గుజరాత్‌లోని నాడియాడ్‌లో జన్మించిన ఆయన స్వాసంత్ర సమరయోధిడిగా, రాజకీయ నాయకుడిగా ఎంతో దేశానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు.

## వైసిపి మండల కన్వీనర్‌గా మెడికల్‌స్టోర్ సూరిరెడ్డి



సూరిరెడ్డి

**అమడగూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త**

అమడగూరు మండల వైసిపి మండల కన్వీనర్‌గా బాలన్నగారిపల్లి గ్రామానికి చెందిన మెడికల్‌స్టోర్ సూరిరెడ్డిని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. వైసిపి ప్రతిపక్షంలో వున్నప్పుడు, ప్రస్తుతం అధికారంలో వున్నప్పుడు ప్రజల కోసం నిరంతరం కష్టపడినందుకు ప్రతిఫలంగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తనపై నమ్మకంతో ఇలాంటి పదవి అప్పగించడం పట్ల ఆయన ఎమ్మెల్యేతో పాటు వైకాపా సీనియర్ నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలియచేశారు.

## అదుపు తప్పిన లారీ

**తప్పిన పెను ప్రమాదం**

**- ఫెయిల్ అయిన లారీ బ్రేకులు, రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ధ్వంసం**
**- నుజ్జునుజ్జ అయిన ఆటో, రెండు ద్విచక్ర వాహనాలు, ఆటో పలువురికి గాయాలు**



రాజశేఖర్‌రెడ్డి విగ్రహన్ని ఢీ కొన్న లారీ

**ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 31, ప్రభాతవార్త**



గాయపడ్డ వారికి వైద్య చికిత్సలు చేయిస్తున్న ఎంపిడిఓ

ఎరువును తీసుకు వస్తున్న ఒక లారీ బ్రేకులు ఫెయిల్ అయి అదుపు తప్పి దివంగత ముఖ్య మంత్రి రాజశేఖర్‌రెడ్డి విగ్రహన్ని ఢీకొని ధ్వంసమైన ఘటన సోమవారం మండల కేంద్రంలో జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. లేపాక్షి చెందిన శ్రీరాములు తన లారీలో నల్ల మాడ నుంచి ఎరువును తీసుకువస్తున్న సందర్భంలో స్థానిక వైఎస్సార్ కూడలికి సమీపాన లారీ బ్రేకులు ఒక్కసారిగా ఫెయిల్ అయ్యాయి. దీంతో కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహంను ఢీకొట్టగా విగ్రహం పూర్తిగా ధ్వంసం అయింది. పార్కింగ్ చేసిన 2 ద్విచక్ర వాహనాలు, 1 ఆటో ధ్వంసం అయ్యాయి. దీంతో ఆటోలో ఉన్న యర్రవంకపల్లి నాగేంద్ర, మామిళ్లకుంట్లపల్లి ప్యాకెట్ రామచంద్రారెడ్డి, నాగమ్మతో పాటు ఆటో డ్రైవర్ జయచంద్ర, బస్సు కోసం వేచి ఉన్న డబురువారిపల్లికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఉత్తప్పలు తీవ్రంగా గాయపడ్డారు. కాగా ఇంత పెనుప్రమాదం సంభవించినప్పటికి ఎవరికి ప్రాణాపాయం లేకపోవడంతో పలువురు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే ఎస్పై గోపి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహయక చర్యలు చేపట్టారు. గాయపడ్డవారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సలు చేయించారు. అనంతరం వారికి మెరుగైన వైద్యం కోసం కదిరి ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎంపిడిఓ పోలప్ప అసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు.

**పలువురు సహాయక చర్యలు :** ప్రమాదం జరిగిన వెంటనే అక్కడే ఉన్న వైసిపి, టిడిపి నాయకులు మల్లారి క్రిష్ణారెడ్డి, కంచి సురేష్, స్థానికులు హుటాహుటిన స్పందించారు. గాయపడ్డ వారికి ప్రథమ చికిత్సలు అందచేయడంతో పాటు వారికి పాలుబ్రెడ్లు అందించారు.

## ఫిర్యాదుదారులు పుల్ అధికారులు నిల్

**- స్పందనకు డుమ్మా కొడుతున్న పలు శాఖల అధికారులు**

**కదిరి టౌన్, అక్టోబర్ 31, ప్రభాతవార్త**



స్పందనలో అధికారుల రాక ఖాళీ కుర్చీల దర్శనం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందనా కార్యక్రమానికి కదిరి పట్టణ, మండలానికి చెందిన పలు శాఖల అధికారులు సోమవారం గైర్హాజరీతో కుర్చీలు వెలవెలబోయాయి. దాదాపు 25పైగా శాఖలకు చెందిన అధికారులు ఉండగా కేవలం తహశీల్దార్‌తో పాటు మరో 3 శాఖలకు చెందిన అధికారులు మాత్రమే స్పందన రిజిష్టర్‌లో సంతకాలు చేశారు. ఆయా శాఖలకు చెందిన అధికారులు స్పందనకు రాకపోవడంతో ఇతర శాఖలకు చెందిన సమస్యలను తహశీల్దార్ ముకుందానే ఫోన్ ద్వారానో, లేక ఇతర సిబ్బందితోనో లబ్ధిదారుల సమస్యలపై చర్చించడం కనిపించింది. ఎంతో ముఖ్యమైన ప్రజల సమస్యలు తీర్చే స్పందన కార ్యక్రమానికి ఇలా అధికారులు దుమ్మాకొట్టడంపై పలువురు ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేయగా లబ్ధిదారులు మాత్రం ఉసూరుమంటూ ఇళ్లకు చేరుకోవడం సర ్వత్రా చర్చనీయాంశం అయింది.

## అగ్రి గోల్డ్ సమస్య పరిష్కరించాలని వినతి

**కదిరి టౌన్, అక్టోబర్ 31, ప్రభాతవార్త**



వినతిపత్రం అందచేస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

అ గ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కదిరి మండల అధ్యక్షులు అత్తార్ మహబూబ్‌బాష ఆధ్వర్యంలో తహశీల్దార్ ముకుం దాకు బాధితులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సంస్థ మూతబడి 7 సంవత్సరాలు దాటినా ఇంతవరకూ బాధితుల సమస్యలు తీరడం లేదన్నారు. ముఖ్యమంత్రి స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులన్నీ ప్రభుత్వం ఆధీనంలో ఉన్నందున వాటిని విక్రయించి, లేదా కుదువు పెట్టి బాధితుల డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## జానపద వృత్తి కళాకారుల సంఘం కమిటీ ఎంపిక



భజన బృందం

**అమడగూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని శ్రీచౌడేశ ్వరిదేవి ఆలయంలో సోమవారం జానపద వృత్తి కళాకారుల సంఘం వ్యవస్థాపకుడు అధ్యక్షులు తిరుపతి పులిమామిడి యాదగిరి ఆధ్వర్యంలో అమడగూరు జానపద వృత్తి కళాకారుల మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షునిగా పేరవాండ్లపల్లి నరసింహులు, కార్యదర్శి మాధవరెడ్డి, కోశాధికారిగా ఆదినారాయణ, ఉపాధ్యక్షులుగా నారాయణ, శివరాం, నరసింహులు, సహాయ కార్యదర్శులుగా వెంకటరమణారెడ్డి, రామ్ లక్ష్మణ్, వెంకటరమణ, నారాయణప్ప, శాంతమ్మ, లక్ష్మన్న, తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ నాయకులు నారాయణ, అనంతపురం జిల్లా అధ్యక్షులు, జిల్లా కార్యదర్శి సుబ్బారెడ్డి, రాష్ట్ర కమిటీ నాయకులు నల్లచెరువు మండలం అధ్యక్షులు సోమేశ్వర్, జిల్లా గురువు తనకల్లు మండల అధ్యక్షులు చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

## కొట్టాలపల్లిలో మొక్కజొన్న పంట దగ్ధం

**పెద్దపప్పూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త**

మండలంలోని కొట్టాలపల్లి గ్రామంలో సోమవారం షార్ ్ట సర్క్యూ ్యట్ కారణంగా 8 ఎకరాల్లో మొక్కజొన్న పంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన శ్రీనివాసులుకు చెందిన 5 ఎకరాలు, వెంకట నారాయణకు చెందిన 3 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు తెలిపారు. అధికారులు స్పందించి పంట నష్టం అందించాలని రైతులు కోరుతున్నారు.



దగ్ధమైన మొక్కజొన్న పంట

## ఘనంగా కార్తీక సోమవారం వేడుకలు

**తాడిపత్రిఅర్బన్, అక్టోబర్ 31 ప్రభాతవార్త**





శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి, శ్రీరాజరాజేశ్వరిదేవిని అలంకరించిన దృశ్యం

పట్టణంలో కార్తీక మొదటి సోమవారం వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు తెల్లవారు జాము నుండే శ్రీబుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారికి అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మలు అభిషేకాలు నిర్వహించి స్వామివారిని రుద్రాక్ష హారాలతో ప్రత్యేక ంగా అలంకరించారు. శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారికి అర్చకులు గిరిశర్మ కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు శంకరయ్యశర్మ ఆలయ ఆవరణలో పలువురిచేత శ్రీకేదార నోములను భక్తిశ్రద్ధలతో చేయించారు. భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకుని ఆలయ కమిటీ చైర్మన్ పివిఎస్ ఆంజనేయులు, సభ్యులు రమేష్, అంబటి రాఘవేంద్రారెడ్డి, హరిప్రసాద్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అలాగే పోలీసులు బందోబస్తు నిర్వహించారు. హాజరైన భక్తులకు కమిటీ వారు ప్రసాదాలను వితరణ చేశారు. పలువురు భక్తులు ఆలయం ఆవరణలో వున్న రావిచెట్టు, వేపచెట్టుకు పూజలు చేశారు. అనంతరం శివాలయం ఆవరణతో పాటు శ్రీరమణమహర్షి ఆశ్రమం, శ్రీషిరిడిసాయిబాబా ఆలయం ఆవరణలో వనభోజనాలు చేశారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

## రాయితీపై పవర్‌స్ప్రేయర్లు అందించాలి



వినతిపత్రం అందచేస్తున్న బిజెపి నాయకులు

**పుట్లూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త**

అన్నదాతలకు రాయితీపై స్ప్రేయర్లు అందచేయాలని బిజెపి నాయకులు సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కాత్యాయినికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్ప్రేయర్లు కోసం రైతులు మూడేళ్ల నుండి ఎదురుచూస్తున్నారన్నారు. రైతులు మార్కెట్‌లో కొనలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావునా ప్రభుత్వం రైతులకు రాయితీపై స్ప్రేయర్లు, డ్రిప్పులు అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పుట్లూరు మండల అధ్యక్షులు కుంద శ్రీనివాసులరెడ్డి, ఒబిసి మోర్చా మండల అధ్యక్షులు రాగేని రామాంజియాదవ్, జిల్లా కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మండల ఎస్‌సి మోర్చా ప్రధాన కార్యదర్శి కుళ్లాయప్ప, రైతులు చెన్నారెడ్డి, శంకర్‌రెడ్డి, నాగమల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుడిపై దాడి దారుణం



రవీంద్రారెడ్డిని పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

**పుట్లూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త**

యల్లనూరు మండలం బొప్పేపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు రవీంద్రారెడ్డిపై వైసిపి నాయకులు దాడి చేయడం దారుణమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పుట్లూరు, యల్లనూరు మండలాల నాయకులతో కలిసి బాధితున్ని పరామర్శించి భరోసా ఇచ్చారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం హత్యలతో ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తోందన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చాక హత్యలు, మహిళలపై అత్యాచారాలతో క్రిమినల్ రేటు పెరిగిందన్నారు. గ్రామాల్లో టిడిపి కార్యకర్తలు ప్రశాంతంగా వుంటే వైసిపి నాయకులు రెచ్చగొట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి సంఘటనపై దర్యాప్తు చేసి కేసు నమోదు చేయాలన్నారు. అనంతరం దాడి విషయాలపై ఆరా తీసి జిల్లా అధ్యక్షులు కాల్వ శ్రీనివాసులుతో ఫోన్‌లో మాట్లాడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, మాజీ జెడ్‌పిటిసి రామలింగారెడ్డి, నాయకులు రవిచంద్రనాయుడు, దస్తగిరి, మల్లేపల్లి చంద్ర, నాగేశ్వర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నివాళులు అర్పించిన బండారు శ్రావణిశ్రీ

**యల్లనూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త**



కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న బండారు శ్రావణిశ్రీ

మండలంలోని మేడికుర్తి గ్రామంలో టిడిపి సీనియర్ నాయకుడు రామకృష్ణారెడ్డి తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శింగనమల టిడిపి ఇన్‌చార్జ్ బండారు శ్రావణిశ్రీ సోమవార ం మేడికుర్తి గ్రామానికి చేరుకుని నివాళులు అర్పించారు. అలాగే యల్లనూరు టిడిపి సీనియర్ నాయకుడు దాసరి నారాయణస్వామి రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్య క్రమంలో టిడిపి నాయకులు సదాశివారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, దొడ్లో రామాంజి, గోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రాము పాల్గొన్నారు.

## ఆలయంలో కార్తీకమాసం పూజలు



పూజల్లో పాల్గొన్న దృశ్యం

**తాడిపత్రిఅర్బన్, అక్టోబర్ 31 ప్రభాతవార్త**

కార్తీకమాసం మొదటి సోమవారం పురస్కరించుకుని పట్టణంలోని శ్రీమార్కండేయస్వామి ఆలయంలో అర్చకులు జానకిరామయ్యశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమానికి హాజరైన ఉభయందారులకు చల్లా, జాకెట్‌తో పాటు స్వామివారి తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం గణేష్, చెన్నా రాజగోపాల్, లింగంపల్లి రవిశంకర్, గడ్డం పరమేష్, జింకా వేణుగోపాల్, వరదా పుల్లయ్య, చెన్నా గోవర్ధన్, గుర్రం గురుమూర్తి, గునిశెట్టి శ్రీనివాసులు, జక్కా సూర్యనారాయణ, కాల్వ శ్రీనివాసులు, సాదు నారాయణ, చెన్నా శ్రీనివాసులు, జింకా శేఖర్, ఊట్ల వెంకటరమణ, చెన్నా రంగనాయకులు దంపతులతో పాటు వద్ది భాస్కర్, చెన్నా రంగప్రసాద్, ఉపాధ్యక్షులు మహేశ్వరం సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కమిటీ సభ్యులు కాసుల చిన్నసుబ్బయ్య, శింగనమల వెంకటరాముడు, వద్ది నరసయ్య, వద్ది రామకృష్ణ, సోమా నడిపి కొండప్ప, జింకా శంకరయ్య, జానపాటి శంకర్, వరదా వీరనారాయణ, వద్ది నరసరామయ్య, పెద్దఎత్తున పద్మశాలీయులు పాల్గొన్నారు.

## Iకె రన్‌ను ప్రారంభించిన జెసి

**తాడిపత్రిఅర్బన్, అక్టోబర్ 31 ప్రభాతవార్త**



చిన్నారులకు జ్ఞాపికలు అందచేస్తున్న జె.సి

భారతదేశ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకుని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐక్యత పరుగు ఒన్‌కె రన్ (రన్ ఫార్ యూనిటీ)ను మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులతో పాటు పలువురు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు జె.సి జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గదరగుట్టపల్లిలో జనచైతన్యయాత్ర

**తాడిపత్రిరూరల్, అక్టోబర్ 31 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

మండలంలోని గదరగుట్టపల్లిలో సోమవారం జనచైతన్య యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార ్యక్రమంలో యువ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుండి అందుతున్న పథకాల గురించి విరించారు. పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియచేశారు. ఈ కార్య క్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఇరువురు వాలంటీర్ల నియామకం

**యల్లనూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త**



నియామకపత్రం అందచేస్తున్న ఇన్‌చార్జ్ ఎంపిడిఓ, ఇఓఆర్‌డి

మండలంలోని 85 నిట్టూరు గ్రామంలో ఖాళీగా వున్న ఇరువురు వాలంటీర్లను సోమవారం నియమించినట్లు ఇన్‌చార్జ్ ఎంపిడిఓ రామచంద్రారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా వేములపల్లి ఒకరు, 85 నిట్టూరులో ఒకరిని ఇన్‌చార్జ్ ఎంపిడిఓ రామచంద్రారెడ్డి, జెడ్‌పిటిసి భోగాతి ప్రతాప్‌రెడ్డి, ఇఓఆర్‌డి విజయశేఖర్ నాయుడు చేతుల మీదుగా నియామకపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలంటీర్లకు వచ్చిన 50 కుటుం బాలకు సంబంధించి వారికి ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి సర్పంచు అశోక్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు స్నేహ, కృష్ణవేణి పాల్గొన్నారు.

## పాముకాటుతో రైతు మృతి

**పెద్దపప్పూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త**



మృతి చెందిన బుచ్చిరెడ్డి

మండలంలోని నామనాంకపల్లి గ్రామానికి చెందిన వెన్నపూస బుచ్చిరెడ్డి (56) అనే రైతు పాముకాటుకు గురై సోమవారం మృతి చెందాడు. మృతుడు తనకున్న నాలుగు ఎకరాల పొలంలో మొక్కజొన్న పంట సాగుచేశారు. ఉదయం పంటను పరిశీలించేందుకు వెళ్లగా పొలంలో వున ్న పాము కాటువేసింది. దీంతో భయాందోళనకు గురైన రైతు హుటావుటిన మోటర్‌సైకిల్‌పై తాడిపత్రి వచ్చాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## స్పందనలో 2 వినతులు



వినతులు అందచేస్తున్న దృశ్యం

**యల్లనూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రెండు వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపిడిఓ రామచంద్రారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావు, మండల జెఇ నరేంద్ర, హౌసింగ్ ఎఇ సుప్రజ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సుప్రజరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మిదేవి, లైన్‌మెన్ ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

## వెంటనే రోడ్డు పనులు చేపట్టాలి..

**- పాదయాత్రలో బిజెపి జిల్లా అధ్యక్షులు వజ్రభాస్కర్‌రెడ్డి**

**గాండ్లపెంట, అక్టోబర్ 31, ప్రభాతవార్త:**



పాదయాత్రలో పాల్గొన్న వజ్రభాస్కర్‌రెడ్డి

మండల పరిధిలోని సోమయాజులపల్లి గ్రామ పంచాయతీలోని మునగలవాండ్లపల్లి నుండి కురుమామిడి వరకు తారు రోడ్డుకై కంకర పరిచి దాదాపుగా 2 సంవత్సరాలు కావస్తున్నా రోడ్డు వేయకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతూ ద్విచక్ర వాహనాదారులు పలు మార్లు ప్రమాదాలకు గురి కావడం జరిగింది. ఈ విషయం మీద గ్రామస్థులు విన్నపం మేరకు వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు దొనకొండ ఆనంద్ ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లా బీజేపీ అధ్యక్షులు వజ్రభాస్కర్‌రెడ్డి మునగలవారిపల్లి నుండి కురుమామిడి వరకు దాదాపు 6 కిలోమీటర్లు పాదయాత్ర సోమవారం నిర్వహించారు. అనంతరం ఈయన మాట్లాడుతూ ఇక్కడ దాదాపు పది పల్లెలు ఉన్నాయని వీరందరూ కంకరరాళ్ళు వల్ల పలు మార్లు ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురై మరియు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనీ, ఈ రోడ్డు పనులు వెంటనే చేపట్టాలని పలు మార్లు స్థానిక ఎమ్మెల్యే పివి సిద్దారెడ్డి దృష్టికి ప్రజలు తీసుకెళ్ళినా కూడా పటి ్టంచుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు దొనికొండ ఆనంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉత్తమ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కేశవరెడ్డి, రామ్మోహన్, రెడ్డెప్పరెడ్డి, ఆదినారాయణ, ఎస్టి మోర్చ జిల్లా ప్రదాన కార్యదరి ్శ వెంకటేశ్ నాయక్, తుంగచంద్ర శేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, రవీంద్ర, ఆదిరెడ్డి, శ్రీనివాసులునాయక్, బాబునాయక్, అశోక్, బీజేపి నాయకులు గజ్జల చెన్నారెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఉరి వేసుకొని యువకుడు మృతి

**నల్లచెరువు, అక్టోబర్ 31, ప్రభాతవార్త:**



ఉరి వేసుకొని మృతి చెందిన మోహన్‌రాజా

మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఈడగొట్టు ఆంజినేయులు కుమారుడు మోహన్‌రాజ (36) తన గృహంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు ఒక సంవత్సరం నుండి గుండె జబ్బుతో బాధపడుతూ తిరుపతి నారాయణాద్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉన్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం రాత్రి ఇంట్లో ఒక్కడే నిద్రపోవడంతో ఎంత సేపటికి బయటికి రాకపోవడంతో ఉదయం మోహన్‌రాజా తల్లి నారాయణమ్మ ఇంట్లో వెళ్ళి చూడగా మృతుడు చీరతో ఉరి వేసుకొని చనిపోయి ఉన్నాడని మృతు తల్లి పేర్కొంది. మోహన్‌రాజా భార్య సుభాషిని ఫిర్యాదు మేరకు నల్లచెరువు ఎస్పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

